# 10. లక్ష్యం తోడు

ఎప్పటి 1955!

ఆనాటి తన ఎస్సెల్సీ 'ఈ' సెక్షన్ వాళ్ళందరి ఈనాటి చిరునామాలు పట్టుకుని ఒక రెండు రోజుల సమావేశాన్ని ప్లాన్ చేశాడు పట్టాభి. ఒక ఫైవ్‌స్టార్ హోటల్లో- పాత మిత్రుల కలయిక! 48మందిలోనూ 30 మంది వివరాలు సేకరించి వాళ్ళందరికీ ఫోన్ చేసి చెప్పాడు, ముప్పై ఒకటో వాడు సత్యం!

పట్టాభి కంఠస్వరాన్ని ఫోన్‌లో విని పులకించి పోయాడు సత్యం. "పట్టాభీ నిజంగా నువ్వేరా?" అని గద్గదికంగా, ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు.

తాను ఏర్పాటు చేస్తున్న సమావేశం వివరాల్ని చెప్పాడు పట్టాభి. అరవై ఏళ్లనాటి స్కూలు జీవితం. గిర్రున కళ్లముందు తిరిగింది సత్యంకి.

"ఆ రెండు రోజులూ అందరం కలిసి కూర్చుని ముచ్చట్లాడుకోవటమూ, అనుభవాల కలబోత మాత్రమే- ఎజెండా. "ఉయ్ విల్ హ్యావ్ లాటాఫ్ ఫన్" అని ఉత్సాహంగా చెప్పి "రొటీన్ నుంచీ మంచి ఆటవిడుపు. ఎగ్జయిటింగ్‌గా, థ్రిల్లింగ్‌గా వుంటుంది. తప్పకుండా రావాలి. అంతే" అని పాత చనువు ధ్వనిస్తున్న కొత్త అధికారంతో అన్నాడు పట్టాభి.

"బాగుంది పట్టాభి. మన మిత్రులందరికీ చాలా ఉత్సాహాన్నిచ్చే ప్రతిపాదనే ఇది" అన్నాడు సత్యం.

"నిరుడు పూర్వ విద్యార్థి సమ్మేళనం జరిపాను రా. చాలామంది వచ్చారు. అంతకుముందు సంవత్సరం కూడా కాలేజ్‌మేట్స్‌ని పిలిచాను" అని తటాలున "రేయ్, నువ్‌గా పైసా ఖర్చు చేయనక్ఖరలేదని గుర్తుంచుకో. హైదరాబాద్‌కి రానూ పోనూ ప్రయాణఖర్చులు మాత్రమే నీవి" అని నవ్వాడు పట్టాభి.

ఆ తర్వాత తన గురించి మరోకొంతసేపూ మాట్లాడాడు పట్టాభి.

దేశాభివృద్ధికి దోహదం చేస్తున్న అతి పెద్ద 'ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్' కంపెనీకి ఛైర్మన్ పట్టాభి. "నువ్ విని వుంటావ్. లాభాల్లో నడుస్తున్న అగ్రగామి సంస్థరా

మాది" అని గర్వంగా చెప్పాడు. తప్పకుండా మీట్‌కి రమ్మని చెబుతూ ఫోన్ సంభాషణని ముగించాడు పట్టాభి.

సత్యంకి సంతోషం కలిగింది. ఎక్కడినుంచి ఎక్కడి దాకా నడిచొచ్చాడు పట్టాభి అనిపించింది. తల్లిదండ్రులకి నలుగురి ఆడపిల్లల తర్వాతి పుత్ర సంతానం అతడు. తండ్రి పండ్ల దుకాణం మీదే కుటుంబభారాన్నంతా లాక్కొచ్చాడు. పట్టాభి తెలివితేటల్లో చాలా చురుకైనవాడు. చదువులో అందరి టీచర్స్ మెప్పు పొందినవాడు. వారి సహాయంతోనే ముందుకు సాగాడు. తీరా అతను జీవితంలో ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ పైకి వస్తుండగానే తల్లిదండ్రులు కాలం చేశారు.

కొంతమంది అదృష్టవంతుల బతుకు ఏ మునుగీతలూ అక్కర్లేని విజయయాత్రలా సాగుతునుకుందంటాను. అందుకు ఈనాటి పట్టాభి ఉన్నత స్థితే మంచి నిదర్శనం అనుకున్నాడు సత్యం.

పట్టాభి ఆహ్వానం అందిన వారంలోనే యాదృచ్ఛికంగా విజయవాడలోనే – సత్యంకి వెంకటేశు తటస్థపడ్డాడు. సత్యం వుండేదీ విజయవాడలోనే. వెంకటేశు కూడా సత్యంకీ పట్టాభికీ ఎస్సెల్సీ క్లాస్‌మేటే. మాటల్లో పట్టాభి ప్రసక్తి వచ్చింది. తన సమావేశానికి వెంకటేశుని పిలవలేదు పట్టాభి.

"నీ ఫోన్ నంబరుగానీ, అడ్రస్‌గానీ దొరికి వుండవురా" అన్నాడు సత్యం.

అదోలా నవ్వేడు వెంకటేశు. నిర్వేదంగా అన్నాడు, "వాడిప్పుడు చాలా బిగ్‌షాట్‌రా. అతను కట్టిస్తున్న బంజారాహిల్స్ బిల్డింగ్‌కి ఎదురుగానే నేను నడుపుకుంటున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్. ఒకరోజు నేనే అతన్ని గుర్తుపట్టి దగ్గరగా వెళ్ళి పలకరించాను. 'అవునవును. నిన్నిక్కడ ఒకటిరెండుసార్లు చూశాను' అనేసి వెళ్ళిపోయాడు. వాడికి మనమేం గుర్తుంటాం" అని బాధపడ్డాడు.

ఆ తర్వాత పట్టాభి గురించే మాటలు సాగాయి. అతని సమావేశం గురించి చెప్పుకున్నారు. "నేవస్తారా" అంటూ వెళ్లిపోయాడు వెంకటేశు. వెళ్తూ వెళ్తూ "నాలాంటి బజ్జీల గురవయ్య కొడుకెట్టా గుర్తుంటాడ్రా వాడికి!" అన్నాడు, వెంకటేశు.

సత్యం మనసు నొచ్చుకుంది. తొమ్మిదీ, పదీ, ఎస్సెల్సీలో బెంచి మేట్లందరూ కళ్ళల్లో మెదిలారు. పట్టాభి, తానూ, వెంకటేశు మిత్రులుగా 'బజ్జీల' గురవయ్య ఆదరాన్ని ఎన్నెన్నిసార్లు ఉచితంగా అందుకున్నారో గుర్తుకొచ్చింది.

వెంకటేశుని కలిసిన తర్వాత సత్యం పెద్ద ఆలోచనలో పడ్డాడు. ఈ సమావేశానికి వెళ్ళటమా, వద్దా అనే విచికిత్స మొదలైంది. నిజానికి ఈ సంఘటనకి ముందే సత్యం తన ప్రయాణం గురించి తర్జనభర్జనలో వున్నాడు. ఇప్పుడు వెంకటేశు మాటలు ఆ ఆలోచనల్ని ముందుకు తోస్తున్నాయి.

మళ్ళీ వారం మధ్యలో శేషగిరితో పని వుండి అతని దగ్గరికి వెళ్ళాడు సత్యం. శేషగిరి కూడా తమ స్కూల్‌మేటే. బిఏ దాకా చదువుకుని హార్డ్‌వేర్ బిజినెస్ చేస్తున్నాడు. శేషగిరి పట్టాభికి కాలేజ్‌మేట్ కూడా. మాటల్లో పట్టాభి ఆహ్వానం గురించి చెప్పాడు సత్యం.

శేషగిరి అన్నాడు, "ఆ, నేనూ వెళ్ళానుగా ఒకసారి" అని "అక్కడంతా పెద్ద షోరా" అన్నాడు నర్మగర్భంగా!

పెద్దగా వివరాలేమీ చెప్పకపోయినా – విషయం అర్థమైంది సత్యంకి.

ఆ రాత్రి సత్యం ఆలోచనల్లో చాలా అనుభవాల స్మృతులు! చిన్నప్పుడెవరింటికో భోజనానికి వెళ్తే –లడ్డులు వడ్డిస్తూ ఒక ముసలావిడ "నీకు లడ్డు సహించదులే నాయనా" అంటూ చెయ్యి విదల్చకుండానే వడ్డన పూర్తి చేసేదిట. అమ్మ చెబుతూ వుండేది– "మన పేదరికమే మనల్ని చులకన చేస్తుందిరా" అని! ఇప్పుడు పట్టాభిదీ అదే తరహా అయిందా?

రాత్రంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు సత్యం. పట్టాభికి ఉత్తరం రాశాడు.

'పట్టాభీ!

నువ్వే నన్ను గుర్తు పెట్టుకుని, నా ఫోన్ నెంబర్ కనుక్కుని, పాతమిత్రల కలయికకి ఆహ్వానించావు, ముందుగా నీకు థాంక్స్! సమావేశం నువ్వన్నట్లుగా 'థ్రిల్లింగ్'గా వుంటుందేమో! కానీ, పట్టాభీ! – మరోలా అనుకోకు. కృష్ణశాస్త్రి అంటాడు, 'ఎప్పుడూ ఉంటుందనుకుంటాను – ఒక కంఠరవానికి ప్రతిధ్వనులు తయారవడం' అని. అలాగే,

నీ ఆలోచనకీ, ఈ సమావేశం నిర్ణయానికీ నేను నా ప్రతిధ్వనిని వినిపిస్తున్నాను. కష్టపడి చాలామందిని పిలిచావు. సరే. పాత మిత్రులమంతా కలుసుకుంటాం. గడచిన ఆరుదశాబ్దాల్లో చదువూ, ఉద్యోగం, వ్యాపారం, పెళ్ళీ, పిల్లలూ, సంసారం బాధ్యతలూ ఎత్తుపల్లాలూ, వంకరగీతలూ... చెప్పుకుంటాం.

ఆ చెప్పుకోవడంలో ఒకరికి స్వోత్కర్ష, ఒకరికి ఆత్మస్తుతీ, ఒకరికి పరనిందా, ఇంకొకరికి వచ్చీరాని మాటలూ, మరొకరికి అసలే గొంతుపెకలని స్థితీ, ఒకరిద్దరికి అంతమంది విజేతల మధ్యలో తాము మాత్రమే అప్రయోజకులమనే ఆత్మన్యూనతాభావం...

ఈనాటి సమాజంలో సగటు మనిషి జీవన పరిస్థితిని అర్థం చేసుకోలేని 'పెద్ద' వారి మధ్యన చెప్పుకోడానికి ఏమీలేని ఏ వొక్కడో వుంటే- అతని పరిస్థితి ఏమిటి? ఒక్కసారి ఆలోచించు. పెరికి పారేసిన పొద్దు తిరుగుడు పువ్వు మొగంతో అందరి మధ్యన ఏ సరదాని అనుభవించగలడు? దిగులు కళ్ళతో, పెదవుల మీద వచ్చీరాని ఏడుపుతో -నువ్వందించే ఆ 'స్టార్' సౌకర్యాల్ని ఏం ఆనందించగలడు- చెప్పు. ఏమో - నువ్వెంతగా 'ఫిల్టర్' చేసి నీ అతిథుల్ని ఎన్నుకున్నా-ఆ సమూహంలో వీరంతా వుంటారనే నా భావన.

ఆ రెండు రోజులూ ప్రతి మనిషికీ దినసరిఖర్చు కనీసం వో ఐదువేలన్నా ఉంటుంది కదూ? కూడికలూ, గుణకారాలూ వద్దుగానీ - ఇంత మొత్తం డబ్బు ఖర్చుతో ఈ తిరణాల అవసరమా- అనే ప్రశ్న నా గుండె గొంతుకలో కొట్టుకులాడుతోంది. ఆ మొత్తాన్ని నువ్ ఏ మరో ప్రయోజనకరమైన సామాజిక కార్యక్రమానికో వెచ్చించకూడదూ?

ఏమో- నా ఆలోచన నాది. 'మీన్ పీపుల్ థింక్ మీన్లీ' అనేవారు మన ఇంగ్లీష్ మాష్టారు జానకిరామయ్య గారు బహుశ ఆ కొటేషన్ నాకు అన్వయిస్తుందేమో! కోపగించుకోకు పట్టాభీ. ఈ 'హంగామా'కి నా మనసు అంగీకరించడం లేదు. నేను ఆ మీట్‌కి రాలేను.

చిన్నకోరిక. నీకెప్పుడైనా అవకాశం దొరికితే, విజయవాడ వచ్చి వెళ్ళు. మా కుటీరాన్ని పావనం చెయ్యి. నిన్ను నిరుత్సాహపరచివుంటే క్షమించు. సత్యం"

ఉత్తరం పోస్ట్‌చేసి ఊపిరి పీల్చుకున్నాడు సత్యం. మనుస్సులో తాను పడిన మథనకి ఇలా ముగింపునిచ్చాడు.

ఆ తర్వాత ఆ మీట్ గురించి మరచిపోయాడు.

నెలరోజుల తర్వాత -

ఓరోజు ఉదయం విజయవాడలో ఊడిపడ్డాడు పట్టాభి. సత్యం ముందు వాలాడు.

పట్టాభి మొహంలో కళ లేదు. తన ఆహ్వానాన్ని మన్నించనివాడి ఆహ్వానాన్ని మన్నించి ఇక్కడికి వచ్చినందుకు బాధిస్తున్న 'ఇగో' ప్రతిఫలనమేమో అది!

పట్టాభిని తన ఇంటికి తీసుకెళ్ళి చేతనైనంతలో మంచి అతిథ్యమే ఇచ్చాడు సత్యం.

మాటల్లో - పాతకబుర్లూ చాలా దొర్లాయి.

సత్యం భార్య గతించిన సంగతి విని బాధపడ్డాడు పట్టాభి. సత్యంకి పిల్లలు లేరు.

మధ్యాహ్నం భోజనాలైన తర్వాత తాను నిర్వహిస్తున్న 'ప్రోత్సాహ' ప్రాంగణాన్ని పట్టాభికి చూపించాడు సత్యం.

తనకున్న ఇంటినీ, తోటనీ 'వికలాంగుల వసతి ఉపాధి కల్పన' కేంద్రంగా వినియోగిస్తున్నాడు సత్యం. తీర్చిదిద్దినట్లున్నది ప్రాంగణమంతా. స్వయం పోషణకు అవసరమైన కూరగాయలు, ఫలవృక్షాలతో కళకళలాడుతున్నది తోట. ఒక పక్కగా చిన్న డైరీఫామ్ వుంది. మరో ప్రక్కన వృత్తి విద్యాశిక్షణ యూనిట్ వున్నది. ఆ పనులన్నీ ఒక క్రమవిధానంలో చకచకా సాగిపోతున్నాయి. ఇరవైమంది దాకా యువతీ యువకులు ఈ పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

అంతా చూసీ, అన్నీ వినీ "యూ ఆర్ రియల్లీ గ్రేట్" అంటూ కరచాలనం చేశాడు పట్టాభి. "వట్టి మాటలు కట్టిపెట్టోయ్- అన్న ఉపదేశాన్ని అక్షరాలా పాటిస్తున్నావ్. పూని ఒక మంచి పని చేస్తున్న ఘనుడివి" అని మరీ మరీ అభినందించాడు. "నువ్ నీ లెటర్‌లో రాసినట్లు నేను నిర్వహించిన మన మిత్రుల సమావేశం నామకహ జరిగింది అంతే" అన్నాడు.

మిత్రుడి అభినందనకి మౌనం ఒక భాషే అన్నట్లు వినమ్రంగా నిలబడ్డాడు సత్యం.

అప్పుడే -

వీరు నిలబడి వున్న చోటికి ఒక యువతి ఉరుకులు పరుగుల మీద వచ్చింది. ఆమెకు ఒక మోచేయి 'స్టబ్' చేయబడి వుంది. ఒక కాలు పోలియోగ్రస్తమై ఉంది. ఒగరుస్తూ సత్యంకి చెప్పింది. "సారూ- ఇప్పుడే నెట్‌లో రిజల్ట్స్ వచ్చినై. ఐఐటీ ర్యాంక్ వచ్చింది సార్. అంతా మీ దయ, ఆశీర్వాదం" అన్నది. ఆమె కళ్ళల్లో నీళ్ళు ఉబికినై. వంగి పాదాభివందనం చేసింది.

ఆమెను వాత్సల్యంతో లేపి, బుజం తట్టి, "పిచ్చిపిల్ల! చాలా సంతోషం. అభినందనలు" అని "యూ ప్రూవ్డ్ యువర్ మెటెల్ . 'ప్రోత్సాహ' మొత్తానికి నీ విజయం గర్వకారణం" అన్నాడు సత్యం.

ఇతర మిత్రులూ చేరారు. అభినందన పరంపర సాగింది. పట్టాభికీ విషయం అర్థమైంది. "కంగ్రాట్స్" అన్నాడు. కరచాలనం చేశాడు. ఆమె థాంక్స్ చెప్పింది.

పట్టాభికి ఆమెను పరిచయం చేశాడు. "ఫ్లోరోసిస్ బాధితురాలు" అని "నాలుగేళ్ళ నుంచీ ఇక్కడ ఉంటోంది. ఏ కార్పొరేట్ కాలేజ్ కోచింగ్ లేకుండా స్వయంకృషితో ఈ విజయం సాధించింది" అన్నాడు.

"అంతా మా సత్యం సార్ గైడెన్సే" అన్నారు పక్కనున్న వారెవరో.

అప్పుడే చెట్టునుంచి కోసిన జామకాయ ముక్కల్ని పళ్ళెంతో తెచ్చిందొక యువతి. అందరూ తలో ముక్కా తీసుకున్నారు. ఆ తర్వాత కూడా అక్కడ ఆ ఉత్సాహం కొనసాగింది.

–ఆ రాత్రికే పట్టాభి తిరుగుప్రయాణం.

బయల్దేరుతూ "సత్యం! నువ్ గొప్ప ప్రాక్టికల్ ఫిలాసఫర్వి. గ్రేట్ ఎఛీవర్వి" అన్నాడు పట్టాభి.

"చిన్న ఆశయవాంఛ హృదయాన్ని స్పందింపజేసింది. అంతే. స్పందనం జీవలక్షణం కదా" అంటూ నవ్వేశాడు సత్యం.

సత్యంనే తదేకంగా చూస్తున్న పట్టాభి మొహం మీద గొప్ప అపూర్వానుభవ ముద్ర ప్రతిఫలించింది.

ధారాళంగా వీస్తున్న కమ్మతెమ్మెర 'ప్రోత్సాహ'కు మరింత ఉల్లాసాన్ని పంచుతోంది!!!

**(నది, మార్చి 2014)**